

మొక్కజొన్నలో మెలకువలు

ఖరీఫ్ మొక్కజొన్న సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలను వ్యవసాయ అధికారి వివరించారు.

8లో ▸



ప్రాణం తీసిన కూటమి నిర్లక్ష్యం

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో 108 వాహనం పూర్తి సామర్థ్యంతో నడవకపోవడంతో ఓ యువకుడి ప్రాణం గాలిలో కలిసిపోయింది.

8లో ▸



యోగాతో ఆరోగ్యం

రాష్ట్ర స్థాయి యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలు రెండో రోజు ప్రత్తిపాడులో కొనసాగాయి.

8లో ▸

న్యూస్‌రీల్

మట్టి విగ్రహాలే మేలు



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): మట్టి వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కాలుష్య నియంత్రణ మండలి, స్పేస్ స్వచ్ఛంద సంస్థ రూపొందించిన 'పర్యావరణ అనుకూల వినాయక చవితి అవగాహన కార్యక్రమం'పై వాల్‌పోస్టర్లు, కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని, మట్టి విగ్రహాలే మేలని అన్నారు. జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఈఈ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మట్టి విగ్రహాలు, పత్రి ఉపయోగాలపై జిల్లావ్యాప్తంగా కళాజాతాలు నిర్వహిస్తున్నామన్నారు. స్పేస్ ఎన్జీఓ ప్రెసిడెంట్ గోపిశెట్టి మురళీకృష్ణ మాట్లాడుతూ మట్టి ప్రతిమలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. ఏఈ ఎస్.రమేష్, ఎన్.వెంకటరమణ, జిల్లా అటవీ శాఖ అధికారి ఆశాకిరణ్, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి వై.దోసి రెడ్డి, ఆర్డీవో దాసి రాజు పాల్గొన్నారు.

జోన్ ఉల్లంఘనలపై సమీక్ష

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో తీర ప్రాంత నియంత్రణ జోన్ ఉల్లంఘనపై అందిన ఫిర్యాదుల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో తీర ప్రాంత నియంత్రణ జోన్ ఉల్లంఘనకు సంబంధించిన మూడు అంశాలపై కమిటీ సభ్యులతో సమీక్షించారు. నరసాపురంలోని వశిష్ట గోదావరి నది ఒడ్డున ఘన వ్యర్థాలను పారవేయడంపై, నరసాపురం మండలం పీచుపాలెం, లక్ష్మణేశ్వరం గ్రామాల్లో అక్రమ రొయ్యల సాగు, మొగల్తూరు మండలం కేపీ పాలెం సౌత్ గ్రామంలో అక్రమ ఇసుక తవ్వకం, అనధికార రొయ్యల చెరువు తవ్వకంపై ఫిర్యాదులు, వచ్చే నెల 20న నిర్వహించనున్న బీచ్ క్లీనింగ్ కార్యకలాపాలు, ప్రచారాలపై సమీక్షించారు.

మూల్యాంకన విధానంతో సమస్యలు



వినతిపత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

భీమవరం: పరీక్షల నిర్వహణలో కొత్త మూల్యాంకన విధానం సమస్యలకు దారి తీస్తుందని ఏపీటీఎఫ్ జిల్లా శాఖ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం డీఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ప్రకాశం, బీవీ నారాయణ మాట్లాడుతూ నూతన విధానం బోధనా సమయాన్ని హరిస్తుందన్నారు. మార్కుల నమోదు ఉపాధ్యాయులకు పని భారంగా మారిందన్నారు. ఆన్‌లైన్ విధానంలో నమోదుకు మాత్రమే పరిమితం చేసి మిగిలిన నమోదు నుంచి వెసులుబాటు కల్పించాలన్నారు. కొత్త విధానం వల్ల ఫలితాల కంటే నష్టమే ఎక్కువ ఉందన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు జి.ప్రసన్నకుమార్ రమేష్, నాగరత్నాలు, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛాంధ్ర'కు సిద్ధం కండి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో ఈనెల 23న స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమాల నిర్వహణకు సిద్ధం కావాలని జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్షించారు. ఈ వారం డ్రెయినేజీ క్లీనింగ్, పారిశుద్ధ్యం ప్రధానాంశంగా తీసుకున్నారు. ప్రతి జిల్లాకు ప్రభుత్వం 55 స్వచ్ఛాంధ్ర అవార్డులను అక్టోబర్ 2న ప్రకటించనుందని, కార్యక్రమాల అమలులలో ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

గూడెం డీవైఈఓగా కేవీఎస్ఆర్



డీవైఈఓకు అభినందనలు తెలుపుతున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం ఎఫ్ఏసీ ఉప విద్యాశాఖాధికారిగా (డీవైఈఓగా) కేవీఎస్ రామాంజనేయులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రామాంజనేయులు నిడదవోలు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎంగా, చాగల్లులో ఎంఈఓగా పనిచేశారు. రామాంజనేయులకు ఎంఈఓలు హనుమ, జ్యోతి, జెడ్పీ హెచ్ఎం సత్యనారాయణ తదితరులు అభినందనలు తెలిపారు.

భయం గుప్పెట్లో లంక గ్రామాలు

వరద గోదావరి

- లంక గ్రామాలను ముంచెత్తిన వరద
- జలదిగ్బంధంలో ఇళ్లు
- ఆందోళనలో లంక గ్రామాల ప్రజలు
- కొనసాగుతున్న రెండో ప్రమాద హెచ్చరిక



యలమంచిలి మండలంలో కనకాయలంక కాజ్‌వేపై పడవల్లో ప్రయాణిస్తున్న స్థానికులు, విద్యార్థులు



లంక భూముల్లోకి చేరిన వరద నీరు

సాక్షి, భీమవరం: వశిష్ట గోదావరి ఉగ్రరూపం దాల్చింది. ఎగువ నుంచి వస్తున్న జలాలు దిగువన లంక గ్రామాలను ముంచెత్తుతున్నాయి. జిల్లాలోని గోదావరి పరీవాహక లంక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి. భద్రాచలం వద్ద ఉధృతి తగ్గుతుండటం ఊరటనిస్తున్నా గోదావరి శివారు ప్రాంతం కావడంతో వరద నీరు సముద్రంలోకి చేరే వరకు జిల్లాకు ముంపు ముప్పు పొంచి ఉందంటున్నారు.

ఎగువన భారీ వర్షాలతో..

గోదావరి ఎగువ పరీవాహక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో జిల్లాలోని వశిష్ట గోదావరికి రెండు రోజులుగా వరద ఉధృతి పెరిగింది. శుక్రవారం ఉదయం 8 గంటల సమయానికి ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటిమట్టం 14.10 అడుగులకు చేరడంతో జలవనరులశాఖ అధికారులు రెండో ప్రమాద హెచ్చరికను జారీచేశారు. మధ్యాహ్నం 5 గంటల సమయానికి నీటిమట్టం 14.30 అడుగులకు చేరుకోగా 10,800 క్యూసెక్కుల నీటిని పంట కాలువలకు, 13.57 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. భద్రాచలం వద్ద ఉదయం 6 గంటల సమయానికి 49 అడుగులుగా ఉన్న నీటిమట్టం సాయంత్రం 4 గంటల సమయానికి 44.80 అడుగులకు తగ్గింది. ఎగువన వరద తగ్గుతుండటంతో ఒకటి రెండు రోజుల్లో జిల్లాలోను తగ్గుముఖం పడుతుందని జలవనరుల శాఖ అధికారులు భావిస్తున్నారు.

భయం.. భయం

వరద ఉధృతికి లంకల్లో సాగు చేస్తున్న కాయగూరలు, ఇతర ఉద్యాన పంటలు నీటమునిగిపోయాయి. ఆచంట, పెనుగొండ, యలమంచిలి మండలాల్లోని పలు లంక గ్రామాల పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. కనకాయలంక కాజ్‌వే పూర్తిగా నీటమునిగిపోయింది. తప్పనిసరి పరిస్థితుల్లో లంక గ్రామాల ప్రజలు ట్రాక్టర్లు, పడవలపై రాకపోకలు సాగించాల్సి వస్తుంది. గోదావరి నుంచి కొట్టుకు వచ్చిన విషసర్పాలు స్థానికులను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. ఆచంట మండలం అయోధ్యలంక, పుచ్చలలంక, రావిలంక గ్రామాల నుంచి ప్రమాదపుటంచున విద్యార్థులు పడవపై కోడేరులోని పాఠశాలకు వస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో అధిక సంఖ్యలో జనం నాటు పడవల్లో ప్రయాణిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది.

నరసాపురంలో.. నరసాపురం వద్ద గోదావరి నీటిమట్టం బాగా పెరిగి వలంధర్ రేవులో గోదావరి మాత విగ్రహం పాదాలను తాకుతూ ప్రవహిస్తోంది. ఈ రేవులో స్నానాలను నిషేధించారు. లలితాంబ ఘాట్, బాపుఘాట్‌లను వరద నీరు ముంచెత్తింది. పిండ ప్రదానం షెడ్డు లోపలికి నీరు చేరింది. వరద ఉధృతి దృష్ట్యా నరసాపురం–సఖినేటిపల్లి రేవులో పంటు రాకపోకలు వరుసగా రెండో రోజు కూడా నిలిపివేశారు. వరద ఉధృతి పెరుగుతుండటంతో గోదావరి తీరం వెంబడి ఉన్న పొన్నపల్లి, మాధవాయిపాలెం ప్రాంతాల వారు ముంపు భయంతో ఆందోళన చెందుతున్నారు.

పొంచి ఉన్న ముప్పు

వరద తీవ్రత పెరుగుతుండటం లంక వాసుల్ని ఆందోళనకు గురిచేస్తోంది. యలమంచిలి మండలంలో ఏటిగట్టుకు దిగువన ఉన్న దొడ్డిపట్ల మత్స్యకార కాలనీ, కనకాయలంక, పెదలంక, లక్ష్మీపాలెం, యలమంచిలిలంక, బాడవ గ్రామాలకు ముంపు బెడద ఎక్కువ. ఆయా గ్రామాల్లో పది వేలు వరకు జనాభా ఉంటారు. కంచుస్తంభంపాలెం, అబ్బిరాజుపాలెం, గంగడుపాలెం గ్రామాల్లో ఏటిగట్టు దిగువన ఉన్న కొన్ని ఇళ్లు, ఆచంట మండలంలోని అయోధ్యలంక, పెదమల్లం లంక, పుచ్చలంక, అనగారిలంక, పల్లిపాలెం గ్రామాలు వరద ముంపునకు గురవుతుంటాయి. ఆయా గ్రామాల్లో సుమారు 8 వేలకు పైగా ప్రజలు నివసిస్తున్నారు. ఉధృతి పెరిగే కొద్దీ ఈ గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుంటాయి. గత ప్రభుత్వంలో వరద ఉధృతికి ముందే వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు అవసరమైన సహాయక చర్యలు చేపట్టేవారు. ప్రస్తుతం ఆ దిశగా చర్యలు మృగ్యమవుతున్నాయని స్థానికులు అంటున్నారు.



సిద్ధాంతం వద్ద వరద ఉధృతి



ప్రమాదపుటంచున రాకపోకలు సాగిస్తున్న విద్యార్థులు

నూలి అరాచకాల నుంచి రక్షించండి

బీజీబీఎస్ మహిళా కళాశాల వ్యవహారంలో రోడ్డెక్కిన మరో కుటుంబం



నరసాపురం కన్నీటి పర్యంతమవుతున్న కిన్నెర, శ్రీను దంపతులు

నరసాపురం: నరసాపురంలోని పద్మశ్రీ అద్దేపల్లి సర్విశెట్టికి చెందిన బీజీబీఎస్ మహిళా కళాశాల పాలకవర్గం వ్యవహారాలపై రోజురోజుకూ వ్యతిరేకత పెరుగుతోంది. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్ రౌడీలను పెట్టి తమను ఇల్లు కదలకుండా చేస్తున్నారని, స్థలాన్ని, ఇంటిని దౌర్జన్యంగా ఖాళీ చేయిస్తున్నారని వెలిగట్ల కిన్నెర, శ్రీను దంపతులు శుక్రవారం ఆరోపించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, తమకు ఆత్మహత్యే శరణ్యమని విలేకరుల వద్ద కన్నీటి పర్యంతమయ్యారు. కళాశాల కాంట్రాక్ట్ అధ్యాపకులు 55 రోజులుగా నిరసన దీక్షలు చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా పట్టణం నడిబొడ్డున విజయలక్ష్మి కంటి ఆస్పత్రి వద్ద కళాశాల యాజమాన్యం 99 ఏళ్లకు లీజుకిచ్చిన స్థలాన్ని హస్తగతం చేసుకుని 30 ఏళ్లుగా నివాసం ఉంటున్న తమను రోడ్డు పాలు చేయాలని చూస్తున్నారని కిన్నెర దంపతులు వాపోయారు. ఇదిలా ఉండగా సర్విశెట్టి ఆస్తుల విషయంలో జరుగుతున్న అన్యాయంపై అధికారులు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ కేంద్ర పాలక మండలి సభ్యుడు పీడీ రాజు డిమాండ్ చేశారు. 30 ఏళ్లుగా ఉంటున్న వారికి కనీసం నోటీసులు ఇవ్వకుండా దౌర్జన్యం చేయడం తగదన్నారు. మరోవైపు కళాశాల ఆస్తులు నూలి శ్రీనివాస్ అమ్ముకుంటుంటే తాము ఆందోళన చేసినా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. దళిత ఉద్యమ నేత చింతపల్లి గురుప్రసాద్ మాట్లాడుతూ నరసాపురంలో మహిళలపై అరాచకాలు, దౌర్జన్యాలు జరుగుతుంటే డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే అండదండలతోనే ఇవన్నీ జరుగుతున్నాయన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కవురు పెద్దిరాజు, వైఎస్సార్‌సీపీ నేతలు బిళ్ల బ్రదర్స్, నిప్పులేటి సత్యనారాయణ మాట్లాడుతూ నూలి శ్రీనివాస్ ఆగడాలపై ఆందోళన ఉధృతం చేస్తామని, మహనీయుడు సర్విశెట్టి ఆశయాలు కాపాడతామని అన్నారు.

'ఆరోగ్యశ్రీ' నిలిపివేతపై ఆందోళన

- భీమవరం వర్మ ఆస్పత్రిలో సేవలు నిలిపివేస్తూ ఉత్తర్వులు
- కలెక్టరేట్‌కు చేరిన డయాలసిస్ రోగులు, బంధువులు



భీమవరం కలెక్టరేట్‌లో డీఎంహెచ్ఓ వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న రోగులు, బంధువులు

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరంలోని వర్మ ఆస్పత్రి (ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ ఆస్పత్రి)లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తూ ఎన్టీఆర్ వైద్య ట్రస్ట్ సీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో శుక్రవారం నుంచి ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయాయి. కేసుల విషయంలో అవకతవకలు జరిగినట్టు ఆడిట్, రాష్ట్రస్థాయి కమిటీ విచారణలో గుర్తించడంతో ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీలో ఉచిత సేవలు పొందుతున్న సుమారు 200 మంది డయాలసిస్ రోగులు తీవ్ర ఆందోళన చెందారు. వైద్య సేవలు నిలిపివేస్తే తమ ప్రాణాలకు ముప్పు తప్పదని భయపడ్డారు. రోగులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి భీమవరంలోని కలెక్టరేట్‌కు వెళ్లి జాయింట్ కలెక్టర్, డీఎంహెచ్ఓను కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రి నిర్లక్ష్యం, అధికారుల నిర్లిప్తత కారణంగా తమ ప్రాణాలను పణంగా పెట్టవద్దని బోరుమన్నారు. అకస్మాత్తుగా సేవలు నిలిపివేస్తే తమ పరిస్థితి ఏంటని వాపోయారు. తమకు అక్కడే సేవలు కొనసాగించాలని కోరారు. ఇదిలా ఉండగా ఆస్పత్రికి వచ్చిన పలువురు రోగులు సేవలు నిలిపివేయడంతో ఇబ్బందులు పడ్డారు.

సేవలు కొనసాగించేందుకు చర్యలు: డీఎంహెచ్ఓ. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రస్తుతం వర్మ ఆస్పత్రిలో ఎన్టీఆర్ వైద్య సేవలో డయాలసిస్ సేవలు పొందుతున్న వారికి అక్కడే డయాలసిస్ సైకిల్స్ పూర్తయ్యే వరకూ సేవలందించేందుకు చర్యలు తీసుకున్నామని డీఎంహెచ్ఓ గీతాబాయి తెలిపారు. తర్వాత జిల్లాలో రోగులకు సమీపంలో ఉన్న డయాలసిస్ యూనిట్‌లకు తరలిస్తామని, డయాలసిస్‌కు సంబంధించి కొత్త కేసులకు వర్మ ఆస్పత్రిలో అడ్మిషన్లు ఉండవని చెప్పారు.

ప్రాణాలతో చెలగాటమా.. రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడటం తగదని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు అన్నారు. సేవలను ఒక్కసారిగా నిలిపివేసి రోగుల ప్రాణాలకు ముప్పు తీసుకురావడం దారుణమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, స్థానికంగా డయాలసిస్ సేవలు పూర్తిస్థాయిలో అందించాలని కోరారు. జిల్లా కేంద్రం భీమవరంలో కేంద్ర మంత్రి, రాజసభ్య సభ్యుడు, పీఏసీ చైర్మన్ వంటి వారు ఉన్నా ప్రభుత్వ డయాలసిస్ యూనిట్ లేకపోవడం బాధాకరమన్నారు.

చవితి వేడుకలకు నిబంధనలు తప్పనిసరి

ఎస్పీ అద్నాన్ నయీం అస్మి



భీమవరం: ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించేందుకు ముందస్తు జాగ్రత్తలు, భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. మండపాల నిర్వాహకులు అనుసరించాల్సిన నియమ నిబంధనలు, భద్రత చర్యలను సూచించారు. మండపాలకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, భద్రతా చర్యలు తప్పక పాటించాలన్నారు. అలాగే ఊరేగింపు, నిమజ్జనం సమయంలో ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు.

'ముత్తూట్' మేనేజర్ చేతివాటం

నరసాపురం: నరసాపురం ముత్తూట్ ఫిన్‌కార్ప్ యూనిట్‌లో మేనేజర్ వినోద్ చేతివాటం చూపించారు. ఖాతాదారుల ఈఎంఐ సొమ్ములను సొంత ఖర్చులకు వాడుకున్నారు. కొంతకాలంగా జరుగుతున్న ఈ బాగోతం శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఈ యూనిట్‌లో అప్పులు తీసుకున్న 26 మంది ఖాతాదారులకు హెడ్ ఆఫీస్ నుంచి నోటీసులు రావడంతో వారంతా కార్యాలయానికి వచ్చి నిలదీశారు. భీమవరానికి చెందిన వినోద్ మూడేళ్లుగా ఇక్కడ పనిచేస్తున్నారు. ఖాతాదారుల్లో నిరక్షరాస్యుల లక్ష్యంగా ఈ తరహా మోసాలకు పాల్పడుతూ జల్సాలు చేస్తున్నట్టు తెలిసింది. ఈఎంఐ బకాయిలు ఉన్న వారి ఇళ్లకు వెళ్లి వసూలు చేసిన సొమ్మును ఖాతాల్లో జమచేయడం లేదని, ఇలా రూ.11 లక్షల వరకు మోసం చేసినట్టు తెలిసింది. ఈఎంఐ సొమ్ములను తన సొంత ఫోన్‌పే ఖాతాకు జమచేసుకున్నట్టు సమాచారం. బాధితుల సంఖ్య మరింత ఉండవచ్చని భావిస్తున్నారు. వినోద్‌పై సంస్థ ఉన్నతాధికారులు దర్యాప్తు చేపట్టారు. ఇంటి, వ్యాపార రుణాలు ఇప్పిస్తానని చెప్పి పలువురి నుంచి వినోద్ రూ.లక్షల్లో వసూలు చేసినట్టు చెబుతున్నారు.

శ్రీవారి సేవలో కర్నాటక న్యాయమూర్తి



హైకోర్టు న్యాయమూర్తి సుమలతకు జ్ఞాపికను అందిస్తున్న డీఈఓ భద్రాజీ

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చిన వెంకన్న ఆలయాన్ని కర్నాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చిల్లాకుర్ సుమలత శుక్రవారం సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అర్చకులు వేద ఆశీర్వచనాన్ని పలకగా, ఆలయ డీఈఓ భద్రాజీ స్వామివారి మెమెంటో అందజేశారు.

● వరలక్ష్మీ.. వరప్రదాయినీ



అనివేటి మండపంలో వేదికపై వ్రత వేడుక జరిపిస్తున్న అర్చకులు



అమ్మవారికి నీరాజనాలు అర్పిస్తున్న భక్తులు

ద్వారకాతిరుమలలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తూర్పు రాజగోపుర ప్రాంతంలోని అనివేటి మండపంలో ప్రత్యేక వేదికపై అమ్మవారిని వేంచేపు చేశారు. అర్చకులు, పండితులు ఉత్సవమూర్తికి విశేష పుష్పాలంకారాలు చేసి వ్రత పూజ ప్రారంభించారు. అనివేటి మండపం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో సుమారు 3 వేల మందికి పైగా మహిళలు వ్రత వేడుకల్లో పాల్గొని అమ్మవారిని పూజించారు. వేడుక అనంతరం మహిళలకు పసుపు, కుంకుమ, గాజులు, రవికలు, ప్రసాదాన్ని అర్చకులు అందించారు. ముందుగా ఈఓ ఎన్‌వీ సత్యనారాయణమూర్తి సతీమణి అమ్మవారికి పసుపు, కుంకుమలు, పూలు, పండ్లను అందజేశారు. ఈఓ సత్యనారాయణమూర్తి, డీఈఓ భద్రాజీ, ఏఈఓలు పి.నటరాజారావు, మెట్టపల్లి దుర్గారావు, సూపరింటెండెంట్లు జి.సుబ్రహ్మణ్యం, దుర్గాప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్లుప్తంగా

ఇంటింటికీ వైద్య పరీక్షలు



నవాబుపాలెంలో స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నవాబుపాలెం గ్రామంలో నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) 3.0 కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. దీనిలో భాగంగా ఇంటింటికీ తిరిగి నోటి, గర్భాశయ, బ్రెస్ట్ కేన్సర్ వంటి వ్యాధులకు స్క్రీనింగ్ పరీక్షలు, రక్తపోటు, మధుమేహం పరీక్షలు చేశారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కేఎంఆర్, కిషోర్, జిల్లా ఎపిడమాలజిస్ట్ సుభాష్, మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి సింధు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

4 దరఖాస్తులు వస్తేనే డ్రా



ఎక్సైజ్ సీఐ స్వరాజ్యలక్ష్మి

తాడేపల్లిగూడెం: బార్లకు దరఖాస్తు చేసుకొనే విషయంలో నిబంధనలను సడలించినట్టు ఎక్సైజ్ సీఐ ఇ.స్వరాజ్యలక్ష్మి తెలిపారు. ఒక్కొక్క బార్‌కు నాలుగు దరఖాస్తులు వస్తేనే డ్రా తీస్తారని, అలా రాకుంటే ఆ బార్లకు లాటరీ తీయరన్నారు. నాలుగు దరఖాస్తులు రాకపోతే రుసుంగా చెల్లించిన రూ.5 లక్షలు తిరిగి చెల్లిస్తారన్నారు. ఇతర సమాచారం కోసం తాడేపల్లిగూడెం, భీమవరం ఎక్సైజ్ కార్యాలయాల్లో సంప్రదించొచ్చన్నారు.

ఆన్‌సైట్ కంపోస్టు యూనిట్ ప్రారంభం



ఆన్‌సైట్ కంపోస్టు యూనిట్ పారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్

తాడేపల్లిగూడెం: పురపాలక సంఘ పరిధిలోని 15వ వార్డు సవిత్ర్యపేటలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆన్‌సైట్ కంపోస్టు యూనిట్ కార్యక్రమాన్ని శుక్రవారం కమిషనర్ ఎం.ఏసుబాబు ప్రారంభించారు. తడి చెత్తను ఎరువుగా మార్చే ప్రక్రియ గురించి వివరించారు. మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులకు ప్రోత్సాహం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బేబి

తాడేపల్లిగూడెం రూరల్: ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు చేసుకున్న వారికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.బేబి అన్నారు. ప్రధానమంత్రి మాతృవందన యోజన పథకంపై శుక్రవారం మండలంలోని ఉప్పరగూడెం నంబర్–150 అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ బేబి మాట్లాడుతూ మొదటి కాన్పు కింద రూ.5వేలు, రెండవ కాన్పునకు రూ.6 వేలు అందజేస్తుందన్నారు. గర్భస్థ దశలో లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ తారక్, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు అల్లూరి



అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైభవ్ తదితరులు

తణుకు అర్బన్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు బ్రిటీష్ వారిపై పోరాటం చేసి ఈ రోజుకు 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా తణుకులో కామేష్ యూత్ నాయకులు సూరంపూడి వైభవ్ స్థానిక ఎస్కేఎస్‌ఐఎం జూనియర్ కాలేజీలో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎ.కార్తికేయ, పి.హేమంత్, పి.సుధీర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

108లో ప్రసవం

నరసాపురం రూరల్: మొగల్తూరు మండలం ముత్యాలపల్లి మోడి గ్రామానికి చెందిన బొక్కా ఏడుకొండలు కుమార్తె దుర్గా భవాని 108 అంబులెన్సులో శుక్రవారం ప్రసవించింది. తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారు. తెల్లవారుజామున పురిటి నొప్పులు రావడంతో 108కు సమాచారమిచ్చారు. ఈ అంబులెన్సులో భవానిని నరసాపురం ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో పురిటినొప్పులు ఎక్కువై 108 అంబులెన్సులోనే ప్రసవించింది. మెడికల్ టెక్నీషియన్ సంజీవ్‌కుమార్ సేవలు అందించారు. ప్రస్తుతం దుర్గాభవాని నరసాపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుంది.

ఖాళీ స్థలాలు.. దోమలకు ఆవాసాలు

- చిట్టడవులుగా, మురికి కూపాలుగా ఖాళీ స్థలాలు
- దోమలు, విష సర్పాలతో బెంబేలెత్తుతున్న ప్రజానీకం
- పట్టించుకోని స్థలాల యాజమాన్యాలు, అధికార యంత్రాంగం



తణుకు ఐక్య నగర్‌లో ఖాళీ స్థలంలో పేరుకున్న పిచ్చి మొక్కలు

తణుకు అర్బన్: మున్సిపాలిటీ పరిధిలోని 34 వార్డుల్లో ఉన్న ఖాళీ స్థలాలు చిట్టడవులను తలపిస్తున్నాయి. పిచ్చి మొక్కలు ఏపుగా ఎదిగిపోయి విష జంతువులకు ఆవాసంగా మారాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిల్వ ఉండి దుర్గాంధానికి నిలయంగా మారుతున్నాయని తద్వారా దోమల విజృంభణ పెరిగిందని వాపోతున్నారు. అంతే కాకుండా ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు, వృక్షాలు భారీగా పెరిగిపోవడంతో విష సర్పాలకు నిలయాలుగా మారాయని, ఖాళీ స్థలాలను ఆనుకుని ఉన్న భవనాల్లోకి సైతం విష సర్పాలు గోడలపై నుంచి పాకుతూ ప్రవేశిస్తున్నాయని వారు ఆరోపిస్తున్నారు. అంతే కాకుండా పల్లంగా ఉన్న ఖాళీ స్థలాల్లో మురుగు నీరు నిల్వ చేరి దుర్గంధంగా మారాయని స్థానికంగా దుర్వాసనతో ఉండలేకపోతున్నామని వాపోతున్నారు. అధిక శాతం స్థానిక బ్యాంక్ కాలనీలో ఈ ఖాళీ స్థలాల సమస్య ఎక్కువగా ఉందని కొన్నింట భారీగా వృక్షాలు మాదిరిగా మొక్కలు పెరిగిపోగా మరికొన్ని ఖాళీ స్థలాలు పల్లంగా ఉండడంతో వర్షాలకు మురుగు నీరు నిల్వ ఉండడంతో ప్రజానీకం బెంబేలెత్తుతున్నారు.

పిచ్చి మొక్కలతో నిండిన వైనం

పట్టణంలో ఖాళీ స్థలాల యజమానుల నిర్లక్ష్యం కారణంగా ఆయా ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు గుబురుగా పెరిగిపోయి, మురికినీటితో నిండి ఉండడంతో దోమలకు ఆవాసంగా మారాయి. ఈ ఖాళీస్థలాలు. పగలు రాత్రి తేడా లేకుండా దోమలు బాధిస్తున్నాయని ఈ ఖాళీ స్థలాల చెంత ఉన్న నివాసితులు ఆందోళన చెందుతున్నారు. దోమలదాడితో బయటకు రావాలంటేనే భయపడుతున్నామని, చిన్నారులను దోమల బారి నుంచి ఏ రకంగా రక్షించుకోవాలో తెలియని పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. తణుకులోని బ్యాంకు కాలనీ, ఆంధ్రాషుగర్స్ లేఅవుట్, సజ్జాపురం, హౌసింగ్ బోర్డు కాలనీ, పాతవూరు, ఇరగవరం కాలనీల్లో ఈ సమస్యల తీవ్రస్థాయిలో ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వైద్యారోగ్య శాఖ అధికారులు, సిబ్బంది ఫ్రైడే డ్రైడే అని, కీటకజనిత అవగాహన కార్యక్రమాల పేరుతో ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించడమే కాకుండా ఇంట్లోని అనవసర నీటి నిల్వలను తొలగింపజేస్తున్నారని, కానీ ఈ ఖాళీ స్థలాల్లో ఉన్న ఇబ్బందులను ఎవరు పరిష్కరిస్తారని ప్రజానీకం ప్రశ్నిస్తున్నారు. ఇళ్లలో ఉన్న అవసరం లేని సామగ్రిని, నీటి నిల్వలను తొలగిస్తామని కానీ ఖాళీ స్థలాల సమీపంలో ఉంటున్న మా పరిస్థితి ఏమిటని నిలదీస్తున్నారు.

> **మురికి కూపాలుగా ఖాళీ స్థలాలు**
>
> ప్రైవేటు ఖాళీ స్థలాలు అడవుల మాదిరిగా మారి మురికికూపాలుగా ఉన్నాయి. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లేని కారణంగా ఖాళీ స్థలాలను యజమానులు అడవుల్లా తయారుచేస్తున్నారు. స్థానికంగా ఉన్న మాకు ఈ ఖాళీ స్థలాల వలన విష జంతువులు, దోమల బెడదతో బాధపడుతున్నాం. అధికారులు చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలి.
>
> – వి.సాయి సూర్య, స్థానికుడు, తణుకు



తణుకు గురజాడ కాన్వెంట్ వద్ద ఖాళీ స్థలంలో చెత్త, పిచ్చి మొక్కలు



ఆంధ్ర షుగర్స్ లేఅవుట్‌లో ఖాళీ స్థలంలో నిల్వ ఉన్న మురుగు నీరు

ఘనంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం



ముత్యాలమ్మ దేవస్థానంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం చేస్తున్న మహిళలు

తాడేపల్లిగూడెం రూరల్: శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా మండలంలోని ముత్యాలంబాపురం శ్రీముత్యాలమ్మ వారి దేవస్థానంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు దేవస్థానం తరపున వరలక్ష్మీ దేవి ప్రతిమను అందజేశారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు కార్యక్రమంలో పాల్గొని వరలక్ష్మీ దేవిని పూజించారు. అనంతరం మహిళలకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కార్య నిర్వహణాధికారి పాప్పాప్పు హరేరాంప్రసాద్, అన్నంనీడి శ్రీనివాస్, కైరం నాగబాబు, మాకా శ్రీరామ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించారని కేసు నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: ఒక వ్యక్తిని కర్రతో కొట్టి కులం పేరుతో దూషించిన నేరంపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై జేవీఎన్. ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన కొడవటి సన్నిబాబుకు అదే గ్రామానికి చెందిన గోపిశెట్టి సత్యనారాయణకు పాత గొడవలు ఉన్నాయి. దీంతో సన్నిబాబును గోపిశెట్ట సత్యనారాయణ, మరో ఐదుగురు కలిసి కర్రతో చెవిపై కొట్టగా రక్తగాయమైంది. అంతే కాకుండా తనను, తన కుటుంబాన్ని కులం పేరుతో దూషించారంటూ బాధితుడు సన్నిబాబు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్సై జేవీఎన్. ప్రసాద్ తెలిపారు.

'మానవత' సేవలు అభినందనీయం



మహిళకు ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత సంస్థ ప్రతినిధులు

తణుకు అర్బన్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం తణుకులో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు మానవత జిల్లా శాంతి ర్యాలీ చెర్మన్ గమిని రాంబాబు తెలిపారు. సజ్జాపురానికి చెందిన 6 సంవత్సరాల బాలిక నడవలేని మానసిక వికలాంగురాలు కొప్పిర గాయత్రికి వీల్‌చైర్, తణుకు మండలం వేల్పూరు గ్రామానికి చెందిన మహిళ రౌతు రంగమ్మకు వైద్య ఖర్చులు, మందుల నిమిత్తం రూ.5 వేలు ఆర్థిక సాయం, ఊపిరి తిత్తుల వ్యాధితో శ్వాస తీసుకోలేని స్థితిలో మంచానికే పరిమితమైన రేలంగి నివాసి మిరియాల నాగేశ్వరరావుకు వైద్య ఖర్చుల నిమిత్తం తణుకు మానవత సంస్థ నుంచి రూ.5 వేలు, దాత బోడపాటి ప్రసాద్ ఇచ్చిన విరాళం రూ.2 వేలు కలిపి మొత్తం రూ.7 వేలు ఆర్థికసాయంగా లబ్ధిదారుని ఇంటికి వెళ్లి అందజేసినట్లు వివరించారు. ఈ సేవా కార్యక్రమాల్లో తణుకు శాఖ అధ్యక్షుడు కడించర్ల రాజరాజేశ్వరరావు, రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కె.రాధ పుష్పవతి, జిల్లా కన్వీనర్లు ఎస్‌వీ సతీష్‌బాబు, బోయపాటి రామలక్ష్మి, చైర్మన్ వీవీ రామకృష్ణ, కార్యదర్శి కఠారి విశ్వనాధరాజు, వంగూరి హనుమంతరావు, కొమ్మిరెడ్డి ప్రభాకరరావు, ఎన్.సత్తిరాజు పాల్గొన్నారు.

మానవత ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ

అత్తిలి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం అత్తిలి మండల మానవత శాఖ ఆధ్వర్యంలో మానవతా శాంతి ర్యాలీ నిర్వహించారు. అత్తిలి తహసీల్దార్ దశిక వంశీ, ఏఎంసీ ఉపాధ్యక్షుడు కడలి రామాంజనేయులు శాంతి ర్యాలీని ప్రారంభించారు. మానవత సంస్థ 108 మంది సభ్యులతో ప్రారంభమై 136 మండలాల్లో 80 వేల మంది సభ్యులతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటుందని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కమిటీ ఈసీ మెంబర్ ఆనాల ఆదినారాయణరావు అన్నారు. ఫ్రీజర్ బాక్సులు, శాంతి రథాలు, అంబులెన్సులు సమకూరుస్తూ అవసరమైన వారికి రక్తదానం, పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటడం, ప్లాస్టిక్ నిషేధాన్ని ప్రచారం చేయటం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో మానవతా సంస్థ అధ్యక్షుడు కొరిపల్లి విజయకుమార్ సంస్థ కార్యదర్శి కొరిపల్లి హరి, కోశాధికారి కుక్కల వెంకట రామారావు, పూర్వపు అధ్యక్షుడు తోట వెంకట సుబ్బారావు, బోడపాటి సూర్యచంద్రరావు, జీవైవీ రమణ, అల్లబాని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ క్లెయిమ్‌లు పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం రూరల్: ఆరున్నరేళ్లుగా సంక్షేమ బోర్డులో పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను పరిష్కరించాలని గోదావరి గ్రామీణ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చింతల రాజు, పెనుబోయిన హరిశ్చంద్రప్రసాద్, కోశాధికారి కంకిపాటి రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని జగ్గన్నపేటలో గోదావరి గ్రామీణ భవన నిర్మాణ కార్మిక సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల హామీలను ఖచ్చితంగా అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని 60 లక్షల కుటుంబాలకు హామీనిచ్చిందని గుర్తు చేశారు. పెండింగ్‌లోఉన్న 46వేల క్లెయిమ్‌లు పరిష్కరించాలన్నారు. దాసు శివ సాయి, వెంకట్రామన్నగూడెం, జగ్గన్నపేట గ్రామాలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు.

డ్రా తీయకపోతే నగదు వెనక్కి

తణుకు అర్బన్ : బార్లకు దరఖాస్తులు దాఖలు చేద్దామనుకొనే ఔత్సాహిక దరఖాస్తుదారులకు ఒక్కో బార్‌కు 4 దరఖాస్తులు రాని పరిస్థితుల్లో డ్రా తీయకపోతే నాన్ రిఫండబుల్ అప్లికేషన్ ఫీజును తిరిగి వెనక్కి ఇచ్చే వెసులుబాటు ప్రభుత్వం కల్పించిందని ఎక్సైజ్ సీఐ సత్తి మణికంఠరెడ్డి తెలిపారు. ఇది ఒకటి, రెండు దరఖాస్తులు దాఖలు చేద్దామనుకొనే మధ్య తరగతి, సాధారణ ప్రజలకు ఊరటన్నారు. దీంతో బార్లకు భారీ ఎత్తున ఆశావాహులు సిద్ధమయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఇతర వివరాలకు తణుకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎస్సై 9440902436 నంబరులో సంప్రదించాలని సూచించారు.

గణపతి నవరాత్రులు ప్రశాంతంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ సీఐ రవికుమార్

తాడేపల్లిగూడెం రూరల్: గణపతి నవరాత్రులను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించాలని తాడేపల్లిగూడెం రూరల్ సీఐ భీమేశ్వర రవికుమార్ నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం తాడేపల్లిగూడెం రూరల్ సర్కిల్ కార్యాలయం వద్ద తాడేపల్లిగూడెం రూరల్, పెంటపాడు మండలాలకు చెందిన గణపతి నవరాత్రి ఉత్సవ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రవికుమార్ మాట్లాడుతూ ఉత్సవ పందిళ్లకు ముందస్తుగా పోలీస్, ఫైర్, విద్యుత్, రెవెన్యూ శాఖల నుంచి ఆన్‌లైన్‌లో అనుమతులు పొందాలన్నారు. ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా పందిళ్లను ఏర్పాటు చేయాలన్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే పూజలు, భజనలు నిర్వహించాలన్నారు. 12 అడుగుల ఎత్తుకు మించకుండా విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఉత్సవ పందిరి వద్ద రాత్రి సమయాల్లో కాపలా ఏర్పాటు చేయాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు పోలీసు అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీల జెండాలు, హీరోల ఫొటోలు, ఇతర రాజకీయ నాయకులు ఫొటోలు ఏర్పాటు చేయరాదన్నారు. రూరల్ ఎస్సై జేవీఎన్. ప్రసాద్, పెంటపాడు ఎస్సై స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

అపారిశుద్ధ్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్



ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో నిలిచిపోయిన వర్షపు నీరు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణంలో అపారిశుద్ధ్యం తాండవిస్తుంది. ఇటీవల కురిసిన వర్షాలకు ప్రాంగణంలోని పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. ఆవరణలో ఖాళీ స్థలాలను చాలా వరకు పలు వ్యక్తులకు లీజ్‌కు ఇచ్చారు. దీంతో రోడ్డు వైపు ఉన్న స్థలం లీజుదారులు షాపింగ్ కాంప్లెక్స్‌లను ఎత్తుగా నిర్మించారు. కాంప్లెక్స్ ఆవరణలో వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేదు. సుమారు వారం రోజుల నుంచి కాంప్లెక్స్ ఆవరణలో నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. ఈ నీటిని తొలగించడంతో పాటు ఉన్న ఖాళీ స్థలాన్ని మెరక చేయాలని, ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు. కాంప్లెక్స్ ఆవరణలో చెత్తాచెదారాన్ని తొలగించి, బ్లీచింగ్ చల్లించాలని, పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పూడిక తీశారు.. మట్టి వదిలేశారు

పాముల బెడదతో సమస్య జటిలం



ఎల్లప్ప కాలువ పూడిక తీత మట్టితో పాడైన వరి చేల గట్లు

పెనుగొండ: ఇటీవల కాలంలో నిర్వహించిన పంట కాలువ పూడిక తీత పనులు నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారాయి. పెనుగొండ మండలంలో పలు పంటకాలువల పూడికతీత పనులు నిర్వహించారు. అయితే, ఆయా పంటకాలువల వద్ద పూడిక తీసిన మట్టిని కాలువ గట్లపైనా, వరి చేలగట్లపైనా, రహదారుల పైనా వేసి వదలి వేయడంతో రహదారులు ఇబ్బందికరంగా మారాయి. పెనుగొండలో ఎన్నో ఏళ్లుగా మురుగుతో నిండిపోయిన ఎల్లప్ప కాలువ పూడిక తీత పనులు నిర్వహించారు. కానీ తీసిన మట్టిని తరలించకుండా వదలివేయడంతో ఇటు రైతులు, అటు ప్రజలు నానా అవస్థలకు గురవుతున్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో ఇబ్బందులు

ఎల్లప్ప కాలువ పూర్తిగా ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోవడంతో తీసిన ప్లాస్టిక్ వ్యర్థాలను వరిచేల గట్టుపైన పాడేశారు. అదేవిధంగా మునమర్రు రహదారిలో మట్టిని వదలేశారు. దీంతో ఇటీవల కురిసిన వర్షాలతో మట్టి తిరిగి కాలువలోకి జారడంతో పాటు రహదారిపైకి చేరుకొంది. వాహనదారులు వర్షాలకు జారి పడిపోతూ గాయాలపాలవుతున్నా పట్టించుకొనే నాథుడేలేరు. వర్షాలకు మొలచిన తుప్పలు గుబురు పొదలను తలపిస్తున్నాయి. దీంతో తుప్పల్లోకి పాములు చేరి రాత్రి వేళల్లో రోడ్డుపైకి వస్తుండడంతో మునమర్రు రహదారిలో రాత్రివేళ ప్రయాణం చేయడానికి హడలిపోతున్నారు. ఇదే పరిస్థితి పెనుగొండ దేవ రహదారిలోనూ నెలకొంది. ఓల్డ్ ఛానల్ పూడిక తీత తీసిన మట్టిని ఇటీవల విస్తరించిన రహదారిపై పడేశారు. మట్టి దిబ్బలు ఏర్పడి, వాటిపై పొదలు విపరీతంగా ఎదిగిపోయాయి.

పంచాయతీలకు అదనపు భారం

పంటకాలువలు గ్రామాల మధ్యలో ప్రవహిస్తున్న ప్రాంతంలో మట్టిని తరలించడానికి పంచాయతీలకు అదనపు భారంగా మారింది. పెనుగొండ పంచాయతీ పరిధిలో ఓల్డ్ ఛానల్ ప్రసిద్ధి గాంచిన శ్రీనగరేశ్వర మహిషాసురమర్ధనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయం ప్రాంతం నుంచి వెళ్లడంతో మట్టి దిబ్బలు దుర్భరంగా దర్శనం ఇస్తున్నాయి. దీంతో యాత్రీకులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విపరీతంగా పొదలు పెరిగిపోవడంతో పంచాయతీ ఆధ్వర్యంలో మట్టిని తరలించారు. దీని ఖర్చు పంచాయతీకి అదనపు భారంగా మారుతుందని విమర్శించారు. నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో మట్టి దిబ్బలు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

నిరుపయోగ నీటి నిల్వలు తొలగించుకోవాలి



కరపత్రాలు అందజేస్తున్న జిల్లా అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ నాగబాబు

తణుకు అర్బన్: నిరుపయోగంగా ఉన్న నీటి నిల్వలను తొలగించుకోవాలని జిల్లా అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ వై.నాగబాబు అన్నారు. తణుకు మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రతి రోజూ కొద్దిపాటి సమయాన్ని కేటాయించుకుని ఇంటి ఆవరణల్లో శుభ్రత బాట పట్టాలన్నారు. మురుగు నీటి నిల్వలపై మడ్ ఆయిల్ చల్లుకోవాలని దోమ తెరలు వాడాలని కోరారు. అనంతరం బ్యాంక్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్‌ను విజిట్ చేసి ల్యాబ్ రిజిస్టర్‌ను వెరిఫై చేసి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.డానియల్ రాజుతో వెక్టార్ బోర్న్ డిసీజెస్ నియంత్రణ అంశంపై మాట్లాడరు. అనంతరం ఇంటింటికి వెళ్లి దోమల నిర్మూలనకు సంబంధించిన కరపత్రాలను అందచేశారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు, ఫైలేరియా కంట్రోల్ యూనిట్ ఆఫీసర్ కె.సత్యనారాయణ, వార్డు హెల్త్ సెక్రెటరీ బి.శిరీష, వార్డు ఇంజనీరింగ్ సెక్రెటరీ బి.శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాస్, ఆశా కార్యకర్త ఎస్.కుమారి పాల్గొన్నారు.

టీబీ వ్యాధిగ్రస్తులకు పోషకాహారం అందజేత

పాలకొల్లు సెంట్రల్: టీబీ మందులు వాడేవారు తప్పనిసరిగా అదనపు పోషకాహారం తీసుకోవాలని రోటరీ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ రామకృష్ణ ఆనందరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని లంకలకోడేరు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ఎం.నవ్యజీవన్ ఆధ్వర్యంలో టీబీ ముక్తి భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆనందరాజు మాట్లాడుతూ అదనపు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల వ్యాధి నుంచి త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం డాక్టర్ నవ్యజీవన్ మాట్లాడుతూ లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిదిలో క్షయ వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వారికి టీబీ యూనిట్‌లో పరీక్షలు చేయిస్తామన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఆరు నెలలకు మందులు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. వాటితో పాటు నెలకు రూ. 1000 ఇవ్వనున్నట్లు తెలిపారు.

పెరుగుతున్న గోదావరి వరద ఉధృతి

నరసాపురం: నరసాపురంలో వశిష్ట గోదావరి ఉధృతి భారీగా పెరుగుతుంది. గత రెండురోజులుగా ఎగువప్రాంతం నుంచి భారీగా నీరు వచ్చి చేరుతుండటంతో నీటిమట్టం పెరుగుతూ భయపెడుతోంది. శుక్రవారం వలంధర్‌రేవులో అడుగున్నర నీటిమట్టం పెరిగింది. వలంధర్‌రేవులో పిండ ప్రధానం షెడ్డు ప్లాట్‌ఫామ్ పైకి నీరు చేరింది. దీంతో రేవులో స్నానాలు చేయకుండా నిషేధించారు. లలితాంబ ఘాట్ పూర్తిగా నీట మునిగింది. పడవల రేవు వద్ద ప్రవాహ ఉధృతి విపరీతంగా పెరిగింది. రేవులో పంటు రాకపోకలు కొనసాగించే వీలు లేకుండాపోయింది. దీంతో వరుసగా రెండో రోజు పంటు రాకపోకలు నిలిచిపోయాయి. మరో నాలుగురోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

యలమంచిలిలో..

యలమంచిలి: గోదావరి ఎగువ భాగంలో వరద నీరు తగ్గుతూ కిందకు దిగడంతో దిగువ భాగంలో వరద శుక్రవారం రెండడుగుల మేర పెరిగింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పెరిగిన వరద మధ్యాహ్నం నుంచి నిలకడగా ఉండిపోయింది. దీంతో కనకాయలంక కాజ్‌వే పైన వరుసగా నాలుగో రోజు సుమారు నాలుగడుగుల నీరు నిలబడింది. దీంతో ప్రజలు ఇంజన్ పడవలపై రాకపోకలు సాగించారు. తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్ శుక్రవారం కనకాయలంలో పర్యటించారు. అక్కడ శిబిరంలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గోదావరి ఎగువ భాగంలో నీరు క్రమేపీ తగ్గుతుందన్నారు. ఈ ప్రభావం వలన మరో 48 గంటల వరకు ఉంటుందన్నారు. దీని వలన శనివారం, ఆదివారం కూడా కనకాయలంక కాజ్‌వే వరద నీటిలోనే ఉంటుందన్నారు. సోమవారం ఉదయానికి కాజ్‌వే బయటపడే అవకాశం ఉందన్నారు. కాజ్‌వే బయటపడే వరకు ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఇంజన్ పడవలు నడుపుతామన్నారు. ఆయన వెంట వీఆర్వోలు కడిమి ఘనలక్ష్మి, సరెళ్ల లక్ష్మి, కాకితాపల్లి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.